# ఏరు పొంగింది

చెల్లూరి సీతారామేశ్వరరావు



సుభద్ర పుస్తకం చదవడం పూర్తి చేసి ప్రక్కన పెట్టింది. మంచి పుస్తకం చదివానన్న తృప్తి కల్గిందామెకి. నవలలోని సంఘటనలు, సంభాషణలు ఆమెపై చెరగనిముద్రవేశాయి.

అది పురోహిత్ తాజా నవల "విమలకి విముక్తి."

సుభద్ర తిరిగి పుస్తకం అందుకుని అలవోకగా పేజీలు తిరగేయసాగింది. విమలకి విముక్తి నేడువస్తున్న వ్యాపార సాహిత్యంలో ఆణిముత్యం. పురోహిత్ కూడ తిరిగి యింత మంచి నవల రాయలేకపోవచ్చు.

విమల తండ్రి డబ్బుమనిషి. కట్నం యివ్వక్కరలేదని ముసలాడికిచ్చి పెళ్లి చేస్తాడు. కళ్యాణం జరిగిన కొద్దికాలానికే విమల తిరిగి కుమారి అయింది, వైధవ్యం పొందింది. కాని దానితోబాటు ఐశ్వర్యం కూడ. విమల బావ సంఘసంస్కర్త. విమల దగ్గర ఆశయాలు వల్లించి అభిమానం సంపాదించి, అమెరికాపోయి చదువుకువచ్చాడు ఆమె డబ్బుతో. అతడు తనని వివాహం చేసుకుంటాడని విమల ఆశపడింది. కాని బావ కప్పగంతులేశాడు. "ఆశయాలు పుస్తకాలలో బాగుంటాయి. జీవితంలో బాగోవు. విధవ వివాహం చేసుకుంటే మా వంశం ఏంకావాలి ?"

ముగింపు బాగా నచ్చింది సుభద్రకి.

బావతో పోట్లాడి కారు ఎక్కింది విమల. డ్రయివర్ని పరీక్షించి చూసింది. రెండేళ్ళనుంచి తనదగ్గర నమ్మకంగా

పనిచేస్తున్నాడు.

"డ్రయివర్! ఈ రోజునుంచి నా జీవితానికి నువ్వే డ్రయివర్."

వీరేశలింగంనుంచి ఈ సమస్య సమాధానపడటంనేర్చుకుంది. అయినా యింకా కుంటినడకలే నడుస్తోంది. ఎంతోమంది విమలల కళ్లకి వరదలు వస్తూనే వున్నాయి. కాని ఎంతమంది రక్షింపబడుతున్నారు.

సుభద్ర మంచం దిగి కిటికీ దగ్గరకి వెళ్లింది. రెండు గంటలయివుంటుంది. ఎండ లేదు. మబ్బుగా వుంది.

ఎదురింటిగోడమీద కొత్త సినీపోస్టర్లు కనిపించాయి. ఓ కుర్రాడు రిక్షాలో తిరుగుతూ మైక్‌లో 'గొప్ప తగ్గింపు ధరలు' అలసించిన ఆశాభంగం' అంటూ అరుస్తున్నాడు. చిన్నపిల్లలు ఆ రిక్షా వెనక పరుగెడుతున్నారు. రెండు కుక్కలు యానాదివాళ్ళని చూసి గట్టిగా మొరుగుతున్నాయి.

తనలో తప్ప .... అంతటా మార్పు కనిపిస్తోంది.

చిరుచిరుజల్లులు ప్రారంభమయ్యాయి. రోడ్డుమీదవాళ్లు యిళ్లకేసి పరుగెడుతున్నారు. అరుగుమీద షోకేసుముందు వాచీలు బాగుచేస్తున్నాడు రషీదు. వానకి వచ్చే జనాన్ని అవతల అరుగుమీదకి వెళ్లమని కసురుతున్నాడు.

కిటికీ సుభద్రకి పెద్ద రిలీఫ్. ఇరుకు గదినుంచి బయట ప్రపంచాన్ని కొద్దిగానైనా చూపిస్తుంది.

సుభద్ర చాలాసేపు అలాగే నిలబడింది. గడియారం నాలుగు గంటలు కొట్టింది. పనివేళ అయింది. ఆలస్యమైతే వదిన చివాట్లు తినాలి. గుమ్మం దాటుతూండగా బీరువాకున్న అద్దంలో ప్రతిబింబం పడింది. అది "నీకు విముక్తి ఎప్పుడు సుభద్రా?" అంటోంది, అడుగుతోంది, ప్రశ్నిస్తోంది.

సుభద్ర వయసు వసంతంలో వుంది. మనసు శిశిరంలో వుంది. ఆశలు ఆకాశం మీద వున్నాయి. దురదృష్టం నేలమీద వుంది.

సుభద్ర ఉప్మా చేస్తుండగా కౌసల్య కొన్న చీర విషయం ఆలోచిస్తూ మంచం మీద దొర్లుతున్న కాదంబరి దిగ్గున లేచింది. ఏమయినా ఆ చీర యివాళ కొనెయ్యాలి? ఇప్పటికే మిడిసిపడుతోంది కౌసల్య.

కాదంబరి భర్త కుంచితపాదంకి ఈ మధ్యే ట్రాన్స్‌ఫర్ అయింది. పిల్లల చదువులవల్ల కాపురం పెట్టలేదు. తనే ఆదివారాలు వస్తాడు.

కాదంబరికి–కౌసల్యకి మహిళామండలిలో పోటీవుంది. కౌసల్య ఓ అవినీతి ఆఫీసరు పెళ్ళాం. అందుచేత ధనరేఖ కెర్రిగొడ్డులా వుంది. నిత్యం షాపింగ్ అంటూ – అవీ యివీ కొంటూంటుంది. కాని ఊరుకుంటే మంచిదే కాని వాటిని కాదంబరికి చూపిస్తుంది.

కాదంబరి మొగుడు గుమస్తా. తను కౌసల్యతో పోటీవెయ్యలేదని ఆమెకి తెల్సు. కాని నలుగురిముందు ఒప్పుకో లేదు. భర్త ట్రాన్స్‌ఫర్ మూలంగా యింటిపెత్తనం వచ్చింది.

సంసారం ఖర్చులు తగ్గించి, చీరలు వగైరాలు కొంటూంటుంది, 'నీకంటే తక్కువేంకాదు, అని కౌసల్యతో పోటీ పడడానికి.

కాదంబరికి ఫాల్స్‌ప్రిస్టేజి కావాలి; తిరిగి అప్పులుచేసి యింటి ఖర్చులు సరిపెడుతుంది. కాదంబరి యిలా నిత్యం ఋణానందలహరిలో మునిగితేలుతూం టుంది.

ఓ పావుగంటలో కాదంబరి ముస్తాబు పూర్తిచేసింది. సుభద్ర రాత్రి వంట ప్రయత్నం చేస్తోంది. కాదంబరికి వంట పని అన్నా, యింటిపని అన్నా గండం. ఆశపడుచు చేసిపెడితే పై పెత్తనం చేస్తుంది.

బీరువాలోనుంచి పర్సు తీయబోతూ ఆగిపోయింది. తను యిలా చప్పుడు చేయకుండా కొనేస్తే యేంలాభం? తగిన ప్రచారం వుండొద్దూ?

బీరువా మూసి వీధిగుమ్మంలోకి వచ్చింది. అరుగుమీదనుంచి ప్రక్క యింటికి చూసింది. కౌసల్య కనిపించ లేదు. అరుగు దిగి నాలుగడుగులు వేసి "వదినగారూ!" అని పెద్దగా పిలిచింది. కౌసల్య తీరుబడిగా వేరుశనక్కాయలు వలుచుకుని తింటోంది.

"బజారుకు వస్తారా?" వీధిగుమ్మంలో నుంచే కాదంబరి అడిగింది అతిశయంగా, నిత్యం తను బజారుకి పోతున్నట్లు ధ్వనిస్తూ.

కౌసల్య తక్కువదా? "ఇంకా అయిదే కదండీ అవుత? వెళదాం లెద్దురూ? అయినా మా కారు రానివ్వండి. వెధవ రిక్షాల్లో ఎవరు పోతారు?" అంది యింకా అతిశయంగా.

"అనుకున్నవెంటనే అయిపోవాలండీ నాకు. నడిచేనా పని పూర్తిచేసుకురావా లనిపిస్తుంది." తను కారుకొనడం అసం భవమైనా యిష్టంలేనట్లు పోజిచ్చింది.

"మా బాగా చెప్పారు. అన్నీ మీరే చేసుకోవాలాయె!"

సుభద్రకి గాడిదచాకిరీ అప్పగించి తను వూరేగి వస్తోందని కౌసల్య అభి ప్రాయం. కాదంబరి ఆ అర్థంలో పోకుండా తనకి నౌకర్లు లేరన్న-భావంకి తీసుకుంది. కొంచెం వేడిగా చూసి "మనం చేసుకున్నట్లు వుంటుందా?" వెర్రిగా నవ్వి.

ఒకర్ని ఒకరు పొడుచుకుంటారు. బలహీనతలని వ్యంగ్యంగా చెప్పు కుంటారు, పైకి లేని ఆప్యాయతలు నటించుకుంటారు.

"వుండండి ........ స్నానంచేసి వచ్చేస్తాను. ఈ లోగా మా వారు వచ్చేస్తారు!" అంది కౌసల్య లోపలికి

వెళుతూ-

ఆమె యింటివైభవం చూస్తూకూర్చో వడమెందుకని 'ఇంటిదగ్గర వుంటానని' ఓ పెద్దకేకవేసి రోడ్డు ఎక్కింది.

రషీద్ అటుయిటు తిరగడం చూసి "ఏమిటయ్యా వెతుకుతున్నావ్ .... ఏమన్నా పడిపోయిందా?" కాదంబరి ఆగి ప్రశ్నించింది.

"మా పాప కనిపించిందా అమ్మగారూ?"

"లేదే.... అయినా పిల్లని యిక్కడికి తీసుకొస్తున్నావెందుకు? వాళ్లమ్మ దగ్గర వుండదా?"

"వాళ్లమ్మ పోయిందండీ మొన్న రాత్రి"

"అరెరె అందుకా చిన్న దుకాణం తియ్యకపోత .... మరి బంధువులు ఎవరూ లేరా? ఈ రెండేళ్లపిల్లని ఎలా పెంచుతావయ్యా."

రషీద్ దీనంగా చూశాడు."బీదవాడికి బంధువులేమిటమ్మా? ఇంటిదగ్గర పిల్లని వదిలేసి ఎలా రాను! అందుకే పని పాడుచేస్తున్నా తీసుకువస్తున్నా."

"ఎంత కష్టం వచ్చిపడిందయ్యా? ముందర పాపని చూడు! రోడ్డుమీద బళ్లు కార్లు తిరుగుతున్నాయి ...." కాదంబరి యింట్లోకి వచ్చేసింది.

దత్తు, మురళి, సరళ స్కూలు నుంచి వచ్చి 'యుద్ధకాండలో' వున్నారు. సరళ తల్లిని చూసి రాగం పెంచేసింది పెద్దన్నయ్య నన్ను కొట్టాడు అంటూ.

"పిళ్లు యిలా కొట్టుకుచస్తుంటే ఏం చేస్తున్నావే?" వంటింటికేసి చూసి గంయ్‌మంది.

సుభద్ర బావినుంచి నీళ్లు తీసుకు వస్తోంది బిందెతో.

"గంగిరెద్దులా చేసిన పనే చేస్తుంటావ్.... ఆ టిఫిన్ పడెయ్యి వాళ్ళకి. తర్వాత చేసుకోవచ్చు." కాదంబరి పురమాయించి బీరువాలోంచి పరుసు తీసింది.

అరవై రూపాయలే వున్నాయి.

చీర ఎనభై.

ఎనభై వుందనుకుంది. ప్రొద్దుట దత్తుకి యిరవై రూపాయిలు స్కూల్ ఫీజుకి యిచ్చింది కదా!

వాయిదావెయ్యడం ఆమెకి నచ్చదు. అప్పు వచ్చే మార్గాలు వెతికింది. చుట్టూరా లాభంలేదు. అందరికీ అంతో యింతో యివ్వాలి.

సుభద్రకి పురమాయించాలి యిక.

కాదంబరి వంటింట్లోకి వచ్చింది. సుభద్ర వంకాయలు తరుగుతోంది. కాదంబరికి యింకా టిఫిన్ మిగలడం చూసి "నువ్వు తినలేదా?" అనుగింది మెత్తగా.

"తింటాలే వదినా!"

"చారబడి యింత తినవేమే. ఎలా పుల్లలా తయారవుతున్నావో చూడు."

వదిన లాలన ఎప్పుడు వస్తుందో సుభద్రకి తెలుసు. "సునీత దగ్గరకి వెళ్లాలి

కాటోలు" అనుకుంది.

"సునీతకి యాభై యివ్వాలి కదా! మరో పాతిక తెచ్చిపెట్టమ్మా. మీ అన్నయ్య రాగానే యిచ్చేద్దాం."

"ఇప్పుడే వెళ్ళనా?"

"తొందరగా రా మరి ... కౌసల్య వస్తే విలబడదు యిక".

సందుచివరే సునీత యిల్లు. పెరటి దారిన రోడ్డెక్కింది సుభద్ర. నాలు గడుగులేనని చెప్పులు వేసుకోలేదు. రాళ్ళకి కాళ్ల బాధగా మూల్గుతున్నాయి.

ప్లీడరీ చేసి కోటు కుట్టించుకోలేని వాళ్లు కోట్లు సంపాదించినవాళ్లవున్నారు. పల్లవరావు రెండో తెగలోకి వస్తాడు. ఆయన న్యాయశాస్త్రం చదివింది అందరికీ న్యాయంచెయ్యడానికి కాదు. తన క్లయింట్లకి అన్యాయం జరగకుండా చూపేటందుకు.

పల్లవరావుకి డబ్బుంది. పొలముంది. మేడుంది. అంతస్థు వుంది. లైవ్ గవర్నర్‌షిప్ వుంది. లేనిది పెళ్ళాం. నీటిమీద కారు వుపయోగంపడనట్లు పల్లవరావు తెలివి ఒక్క విషయంలో మాత్రం పనికిరావడంలేదు. అదే సునీత పెళ్లి.

సునీత సన్నగా వుంటుంది. నల్లగా వుంటుంది. కుడికాలు కుంటి. యవ్వనం ఆమెలో మసకబారిన అద్దంలావుంటుంది. విన్నటి పువ్వులా వుంటుంది. కొత్త యింటికి వ్రేలాడుతున్న మామిడితోరణం ఎండినప్పుడులా వుంటాయి ఖరీదైన చీరలు, నగలు ఆమె వొంటమీద.

సిలోన్ పాటలు వింటోంది సుభద్ర వచ్చేసరికి.

"హాయ్! యిక నేను రేడియో ఆపేయచ్చు!" సుభద్ర బాగా పాడుతుందని తెల్సి.

"పాటలకోసం రాలేదు" కూర్చుంటూ నవ్వి

"మీ వదిన తరిమిపుంటుంది."

"అరె. నీకు జ్యోతిష్యం తెల్సా?"

"నీ జాతకం మాత్రం తెల్సు."

వంటమనిషిని పిలిచి టిఫిన్, టీ తీసుకురమ్మంది సునీత

"అందాకా ఓ పాట పాడు."

"అవతల మా వదిన నాకోసం కంగారుపడుతూంటుంది. బజారుకి వెళ్తుందేమో నన్ను తొందరగా రమ్మంది."

సునీత మోచేత్తో పొడిచింది. "ఇంత అమాయకురాలివేమే! అందుకే మీ వదిన నిన్ను ఆడిస్తోంది. బొట్టు చెరుపుకుని పుట్టెడు దుఃఖంతో యిరవైయేళ్ళకే 'విధవ' బిరుదు తెచ్చుకుని కూచున్నావు. అదేమయినా పట్టిందా ఆమెకి? నీ సుఖం గురించి ఏమైనా పట్టించుకుంటుందా? జీతంలేని పనిమనిషివి."

"అది నా రాత."

"ఇలా ముంగిలా కూర్చుంటే కుదరదమ్మాయ్! వేదాంతం బ్రతుకుని సరిదిద్దదు, గుర్తుపెట్టుకో."

టిఫిన్ వచ్చింది. సుభద్ర తింటూ "అలస్యమైపోతోంది సునీతా" అంది.

"నువ్వు డబ్బు పట్టుకెళ్ళేదాకా మీ వదిన ఎక్కడికీ పారిపోదు! ఎందు కాలస్యమైందంటే నేను లేనని చెప్పు"

వాళ్ళిద్దరూ హైస్కూలుదాకా కలసి చదువుకున్నారు. సునీత కాలేజీలో చేరింది. సుభద్ర తండ్రి మంచంఎక్కి కూతురు పెళ్ళి చూడాలని ఆశపడ్డాడు.

సుభద్ర పెళ్ళికూతురయింది. సుభద్ర తండ్రి పోతూ అల్లుణ్ని కూడా సాయం పిలిచేడు! సుభద్ర బ్రతుకు తెల్లారింది!

సునీత గతరాత్రికొన్నకొత్తరికార్డులు వేసింది. పరధ్యాన్నంగా వింటోంది సుభద్ర.... యింటిదగ్గర వదిన ఉగ్ర రూపం తలచుకుంటూ. అది సునీత గ్రహించి రికార్డుప్లేయర్ ఆపేసింది. డబ్బు తెచ్చియిస్తూ "ఎప్పుడు వచ్చినా ముళ్ళమీద కూర్చుంటావ్?" అంది నిష్ఠూరంగా.

"సునీతా.... మా వదిన ఎలాగూ బజారు కెళ్ళిపోతుంది. నువ్వు మా యింటికి రాకూడదూ.... ఇంచక్కా కబుర్లు చెప్పుకుందాం."

"నేను రావాలా?" సాగదీస్తూ అడిగింది.

సుభద్ర కళ్ళు ఆడించింది. "అవున్లే మా యింటికొనువ్వెందుకు వస్తావ్? మీ గొప్పతనానికి అవమానం కాదూ?"

"ఆ బుంగమూతి చూడాలనే అలా గన్నా! నువ్వు మీ వదినని తరిమెయ్! బట్టలు మార్చుకుని వస్తాను."

"వస్తావుకదూ!" సుభద్ర వేగిరం బయటికి నడిచింది

కాదంబరి యింటిగుమ్మంలో పిచ్చి కుక్కలా తిరుగుతోంది. సుభద్ర డబ్బు యివ్వగానే మూడ్ మారిపోయింది. "ఎక్కడికి పంపినా తొందరగా వచ్చి ఏడవ్వు! అప్పుడే చీకటిపడిపోయిందా? ... ఛీ. ఛీ.... ఏదయినా అంటే. నా నోరు కనపడుతుంది.... పిల్లలు పార్కుకి పోయారేమో.... తలుపేసుకో" అంటూ కౌసల్య యింటికి దారితీసింది.

ఆ చివాట్లు ఆమెకి అలవాటే. మనస్సు బండబారిపోయింది. వదిన కోప తాపాలకి రాజీపడటం నేర్చుకుంది, బ్రతుకు వెళ్ళదీయడానికి.

అన్నగారితో చెప్పుకున్నా లాభం లేదు. వదినకి కార్బన్‌కాపీ. ఆవిడ నొచ్చు కుంటుందని తననే తిడతాడు.

సుభద్ర పెరట్లో పనిలో వుండగా వీధితలుపు తీసిన చప్పుడూ, పిలుపూ వినిపించాయి. సుభద్ర వచ్చి తలుపు తీసింది. స్కూటర్ ఆగివుంది.

"పురోహిత్ వున్నారా?" అడిగా డతను.

"అంటే...."

"మీ వీధిగదిలో అద్దెకి వుంటున్నారు కదా. భరద్వాజ అసలుపేరు. కథలు రాస్తుంటారే!" ఆయన వివరంచెప్పాడు.

భరద్వాజ రచయితా ? తాను అభిమానించే రచయిత. ఆరు నెలలనుంచి అతడు అద్దెకివుంటున్నా ఎవరికీ తెలియదీ విషయం. భలే విచిత్రంగా వుంది.

"లేరేమో... గదికి తాళం వుంది కదండీ" అంది పరిశీలించి

"వివేకా పబ్లికేషన్స్‌నుంచి ధనష్పాదం వచ్చినట్లు చెప్పండి. మాకు నవల యిస్తామన్నారు. తొందరగా పంపించమనండి. నాలుగైదు రోజుల్లో వస్తాను నేను."

సుభద్ర తలూపింది. స్కూటర్ స్టార్ట యింది.

తలుపు రెక్కకి- అనుకుని నిలబడి పోయి వుందామె. పురోహిత్‌కి విమలకి విముక్తిమీద వుత్తరంకూడా రాద్దామనుకుంది. ఆ శ్రమతప్పింది.

పురోహిత్ అక్కడ వుండటం ఆమెకి థ్రిల్లింగ్‌గా వుంది.

"స్వాగతం చెప్పడానికి నిలబడ్డావా?" సునీత ప్రశ్నకి వులిక్కిపడింది.

"నీకో గుడ్ న్యూస్. మన రచయిత పురోహిత్ ఈ వూరు వస్తున్నాడు."

"ఏం ?"

"మా యింటికే ?"

"మీ బంధువా ?"

సుభద్ర చెప్పింది అసలు విషయం.

"భలే డిస్కవర్ చేశావు .... ఏదా మహానుభావుడు ? ఇంకా యింటికి రాలేదా ?"

"ఇవాళ మనం ఎదురుచూస్తామని ఆలస్యంగా వస్తాడేమో !"

ఇద్దరూ యింట్లోకి నడిచారు.

## 2

భరద్వాజ గోళ్ళ గిల్లుకుంటూ కూర్చున్నాడు. కాలం గడవటంలేదు. ప్రొద్దుట చదివిన పేపరు తిరిగవేశాడు. ప్రకటనలు చూశాడు. కస్టమర్స్ వచ్చేజాడ కనిపించలేదు. షోరూంనుంచి బయటికి వచ్చి పిట్టగోడ దగ్గరి కుర్చీలో కూర్చున్నాడు.

నగరం దీపాలవెలుగులో టాక్సాఫీసు తార మందహాసంలా వుంది. రోడ్లు బిజీగా వున్నాయి. షాపులు కిక్కిరిసి వున్నాయి. ఆఖరికి రోడ్డు పక్కన వ్యాపారం చేసుకునే మిర్చిబజ్జీకూడ బిజీగా వున్నాయి. జనం బొంగరాల్లా తిరుగుతున్నారు.

భరద్వాజకి పాతికేళ్ల వయసుంది. తల్లితండ్రీ లేకపోయినా ఎం. ఏ. డిగ్రీ వుంది. కాని అమెరికాలో రూపాయిలా దానికి విలువలేదు. ఉద్యోగ రంగంలో తాండవనృత్యం చెయ్యలేక 'భావానంద డ్రెస్సర్స్'లో జేరాడు. ఆ కంపెనీ రెడీ మేడ్ బట్టలు తయారుచేసి అమ్ముతుంది. దాని యజమాని లింగోజీరావు ఒకప్పుడు లక్షలమీద వ్యాపారం చేశాడు. నౌకర్లు, జూదాలు, ముండలు వ్యాపారాన్ని ఆర్పేశారు. ఇప్పుడు గత వైభవమే - మిగి

లింది. లింగోజీరావు అక్కడ యిక్కడ అప్పులు చేసి వ్యాపారాన్ని కొద్దిగా చేస్తున్నాడు. భరద్వాజకి దుకాణం అప్ప గించి అప్పుల వేటకోసం తిరుగు తూంటాడు.

మేడమెట్లమీద చప్పుడయింది.ఎవరో వస్తున్నారని కౌంటర్లో కూర్చున్నాడు పోయి.

వచ్చింది సునీత.

ఆశ్చర్యంగా చూసి "మీరా? .... రండి. కూర్చోండి." అన్నాడు సంతో షంగా.

"మీరొక్కరే వున్నారేం?"

"పనివాళ్ళు ఎనిమిదింటికి వెళ్లి పోతారు. తొమ్మిదిన్నరదాకా దుకాణం వుంచాలి మా సేట్‌కి బేరాలు లేక పోయినా. బట్టలేమయినా కావాలా?"

సునీత తలూపింది.

లక్నో ఎంబ్రాయిడరీ చేసిన మూడు చీరలు ఆమెముందు పెట్టాడు. సునీత అట్టే పరిశీలించకుండా "ఎంత?" అనడిగింది.

"నూట ఎనభై చీర."

"మూడు ప్యాక్‌చెయ్యండి."

లింగోజీ ఎగిరి గంతేస్తాడు ఈ పెద్ద బేరానికి అనుకున్నాడు. వాటిని ప్యాక్ చేస్తూ "క్రింద తళతళలాడే షాపులు వదిలేసి మా దగ్గరకి రావడం నాకు ఆశ్చర్యంగా వుంది." అన్నాడు.

"చీరలు ఎక్కడయినా దొరుకుతాయి. మీ రిక్కడకాని దొరకరుకదా?"

"అంటే...."

"మీకు తాత్పర్యం కూడా చెప్పాలన్న మాట. నేను మీ కోసమే యిక్కడికి వస్తి."

ఇంతలో లింగోజీరావు వచ్చాడు. భరద్వాజ షాపు అప్పగించి, "పదండి." అన్నాడు. సునీత అతడివెనక నడిచింది. మెట్లమీద చీకటి. నిలవ నీరుండిపోయి రొచ్చువాసన వేస్తోంది. ఈ దుర్గంధం పీల్చలేకే చాలామంది లింగోజీ దుకా ణానికి రారు.

ఇద్దరూ ఎక్కగానే కారు బయలు దేరింది.

"మీ రిక్కడ పనిచేయడం నాకేం బాగాలేదు." అంది సునీత.

"ఒక దశలో ప్రాప్తించినదే పంచా మృత మనుకోవాలి."

"మీకేం మాటలు పండిస్తారు. ఒక సారి నాన్నగార్ని కలవండి."

"ఉద్యోగానికా?"

బెదురుగా తలూపింది.

"ఒక దశలో నేను వుద్యోగానికి ఎదురుచూశాను. ప్రస్తుతం ఆ అవసరం లేదు. కొన్ని పథకాలు వున్నాయి! నా దగ్గర. తొందరలో కార్యరూపానికి వస్తాయి."

అంబాసిడర్ పోర్టికోలో ఆగింది. పచ్చటి చెట్లమధ్య ఆ తెల్లటిమేడ నిద్ర పోయే మృగరాజులా వుంది.

"మీ యింటికి వచ్చాము!" అన్నాడు దిగుతూ.

"డిన్నర్ తీసుకుందాం .... మీకు వేరే ఏంపనిలేదుగా."

"వున్నా కాన్సిల్".

సునీత బట్టలు మార్చుకుని డైనింగ్ టేబుల్ దగ్గరకి వచ్చింది. "నాయర్! నాన్నగారు మెయిల్‌కి వెళ్లారా!"

"మీకోసం చూశారమ్మా కాస్సేపు." అన్నాడు లోపికి వెళుతూ.

భరద్వాజ భోజనప్రియుడు. వడ్డించ బడిన పదార్థాలని తృప్తిగా చూశాడు. సునీత మాట్లాడుతున్నా "ముందర ఆత్మా రాముడి పని. తర్వాత మీది" అన్నాడు.

భోజనాలయ్యాక కారిడార్‌లో కూర్చున్నారు. ఆకాశం మబ్బుగా వుండటంవల్ల గుడ్డివెన్నెల కాస్తోంది. ట్రాన్సిస్టర్‌లో షెహనాయ్ మంద్రంగా వస్తోంది.

భరద్వాజ తాంబూలం నములుతున్నాడు.

"మీ కథ అంధకారంలో చదివాను. శాంత గుడ్డిదయినా చీకటిలో దీపం వెలిగించుకో గలిగింది. అవిటివారికి జీవితం బాధకాదని, నేర్పు చూపించుకుంటే మామూలుగా జీవించవచ్చని రాశారు. ఇది చూసి చాలమంది ధైర్యం తెచ్చుకుంటారు."

"తెచ్చుకోవాలనే నా ఆశ. ఈ ప్రపంచంలో ఏ వస్తువూ, వ్యక్తీ నిరర్థకం కాదు. ఎవరి పాత్ర వారికుంది. అనారోగ్యమయిన పోటీయే అసంతృప్తికి కారణం."

సునీత అరాధనగా చూసింది.

పదిరోజుల తర్వాత సునీత పుట్టిన రోజు వచ్చింది. భరద్వాజని కల్సుకోడానికి 'భావానంద ప్రెస్సర్స్'కి వెళ్లింది.

"రెండ్రోజులైందమ్మా మానేసి." అని చెప్పాడు లింగోజీరావు.

ఇంటిదగ్గర లేడు. మరి ఎక్కడికి వెళ్లినట్లు? .... సునీత మీమాంసలో పడిపోయింది. ఇంత ముఖ్యమైన రోజున అతడ్ని కల్సుకుని తీరాలనిపించింది.

కార్లో వెళుతుండగా పార్క్‌లో కనిపించాడు. సునీత ముఖం కాంతి తెచ్చుకుంది. "నమస్తే కవిగారూ!" అంది దూరాన్నుంచే.

"రండి...." భారంగా పల్కరించాడు.

"మీకోసం షాపుకి వెళ్లాను."

"వెధవ వుద్యోగం మానేశాను.వాడికి అప్పుడొరకనప్పుడల్లా నామీద గంతులేస్తాడు. నేను మాటపడను."

"ఇప్పుడేమిటి ప్లాన్."

"మా స్నేహితుడు మాసపత్రిక పెడుతున్నాడు. నన్ను ఎడిటర్‌గా వుండమన్నాడు. వాడు బొంబాయినుంచి రావడానికి నెలపడుతుంది. ఈలోగా ఓ పెద్ద నవల రాద్దామనుకుంటున్నాను తరాల అంతరాలమీద."

"శుభం. ప్రారంభించేశారా?"

"నా గది రోడ్డుమీదకి వుండటంవల్ల

డిస్టర్బెన్స్‌గా వుంది. పల్లెటూరిలో ఓ స్నేహితుడున్నాడు. ఈ నెల అక్కడికి పోయి రాసుకుందామని వుంది."

"భలేవారే....మాయింట్లో వుండండి."

"మీకే ఆటంకం వుండదు."

"మీకు శ్రమా.... వద్దు. వద్దు."

"పిలవడం నాదే పొరపాటులెండి. నా ముఖం చూస్తే మీకు వచ్చే ఆలోచనలు కూడా రావు." తన కురూపితనం మీద అసహ్యపడింది ఆమె.

"మీరిలా అపార్థం చేసుకుంటారను కోలేదు సునీతా! మీ మాటే కానివ్వండి." తన నిర్ణయం చెప్పేశాడు.

"నిజంగానా!"

"ఒక్క షరతు."

"నేను యిక్కడ వున్నట్లు ఎవ్వరికీ తెలియకూడదు. అందరితోను పూరికెళ్ళానని చెబుతాను."

"మీ అజ్ఞ. దండోరా వెయ్యను. నమ్మండి."

"పదండి"

మర్నాడుదయం భరద్వాజ సూట్ కేస్‌తో వచ్చేశాడు. సునీత రెండవ అంతస్తులో చివరి గది అలంకరింపజేసి తయారుచేసింది.

"మీకూ ఉేస్టువుంది" అలంకరణను చూసి మెచ్చుకున్నాడు.

రోజులు గడుస్తున్నాయి. భరద్వాజకి నవలా రచన చకచక సాగిపోతున్నది. ఏ బాదరబందీ, యిబ్బందీ లేకపోవడం వల్ల ప్రశాంతంగా రాయగల్గుతున్నాడు. సాయంత్రందాకా రాయడం. తర్వాత సుమిత్రతో కార్లో వినోదం. రాత్రి పదింటికి యింటికిరావడం. తిరిగి రెండు గంటలదాకా రాసి నిద్రపోవడం. లేచే సరికి తొమ్మిదవుతుంది. సునీత బెడ్ కాఫీతో సిద్ధంగావుంటుంది. పదిగంటలకి ప్రారంభిస్తే ఒంటిగంటదాకా కలం పరు గెడుతూనే వుంటుంది. అపుడు సునీతతో లంచ్. ఓ కునుకులాగి మూడున్నరకి తిరిగి రచనా కార్యక్రమం.

"ఎవరమ్మా అతడు?" పల్లవరావు ఓ రోజున అడిగాడు.

చెప్పింది.

"నీ కిష్టమేనా?"

"దేనికి?"

"పెళ్లికి."


సిగ్గుపడింది. భయపడింది. భరద్వాజ తనను చేసుకుంటాడా?.

పల్లవరావు ఓ సాయంత్రం భరద్వాజని కలిశాడు. అతను రాసిన పుస్తకాలు పేర్లు తెలుసుకుని కూతురుద్వారా, "అవన్నీ కళాఖండాలన్నాడు." ఇంతటి రచయిత తమ మధ్యవున్నందుకు గర్వ కారణ మన్నాడు. స్నేహం బాంధవ్యానికి దారితీస్తే మంచిదన్నాడు."

"ఎలా? ........ తెలిసే అడిగాడు భరద్వాజ.

"మా సునీతని పెళ్లిచేసుకో"

భరద్వాజ మౌనం




"ఈ ఆస్తి అమ్మాయిదే. సునీతకి మొగుడయితే యిదంతా నీదే అవుతుంది. నీ కింకా ఏంకావాలో చెప్పు. చెయ్యడానికి నేను రడీ" అన్నాడు పల్లవరావు.

కూతురి పెళ్లి యిన్నాళ్ళు పల్లవరావుకి సమస్య. డబ్బు ఆశచూపి ఏదో సంబంధం తెచ్చినా అది సునీతకి నచ్చేది కాదు. ఇన్నాళ్లకి ఆమె యిష్టపడిన సంబంధం వచ్చింది. దీన్ని ఏమయినా పోనివ్వరాదు.

అటా? ఇటా?....భరద్వాజ డైలమా చివరికి యిటేవచ్చి "మీయిష్టం" అన్నాడు బయటికి వెళ్లిపోతూ.

తన నిర్ణయంమీద పార్కులో ఒంటరిగా ఆలోచించాడు. అన్నివిధాల లాభమే కనపడింది. సునీత బంగారుపిచిక.

అతడు యింటికి వచ్చేసరికి, ఫిలిం ఫేర్ తిరగేస్తున్న సునీత, యిన్నాళ్ళు పడని సిగ్గుపడింది.

"ఇదేం శోభనం రాత్రి కాదు" అన్నాడు ఆమె ప్రక్కన కూర్చుని.

పుస్తకం అడ్డుపెట్టుకుంది సునీత.

పుస్తకం లాగి ఆమె నడుంమీద చెయ్యివేసి "ఇదంతా నా అదృష్టం అనుకోనా?" అన్నాడు.

"కాదు నాది. కుంటిదాన్నయి...."

సుతారంగా ఆమె నోరుమూసి .... "అందం ఎక్కడయినా దొరుకుతుంది సునీతా? అందమైన జీవితం దొరకదు అంతటా" అన్నాడు.

సునీతలో హేమంత సంక్రాంతి.

## 3

పెళ్లి స్థిరపడినప్పటినుంచి భరద్వాజ

నవలారచన 'సశేషం' అయింది. రాయ డానికి మూడ్ రావడంలేదు. పొద్దంతా ఆలోచనలకే సరిపోతోందాయె! ఇన్నాళ్ల ఆర్థికస్తోమతులేక తన ఆశల్ని మనసు లోనే వుంచుకున్నాడు. వాటిని బయటికి తీసేరోజు వచ్చింది. తను చేపట్టబోయే కార్యక్రమాలని పదేపదే సమీక్షించుకో సాగాడు.

ఆ రోజు వుదయం పదిన్నరకి రాయా లని కాగితం తీశాడు. కాని పెన్ను రాయ లేదు. కాగితాలు ప్రక్కన పడేసి సిగ రెట్ వెలిగించి రివాల్వింగ్ ఛైర్‌లో వెనక్కి వాలాడు. డబ్బుచేసే గారడీలు అందుబాటులో వుండగా, కాగితాలతో కుస్తీపట్టడం అవివేకమనిపించింది.

డెస్క్‌మీద డైరీపై దృష్టిపడింది. వంగి అందుకున్నాడు. ఇక యిందులో కన్నీళ్ళు, బాధలు వుండవు. సుఖాలు, సరదాలు మాత్రం చోటుచేసుకుంటాయి.

కొన్ని పేజీలు కనిపించగానే మనసు కలుక్కుమంది. రెడ్ బాల్‌పాయింట్ తీసుకుని వాటిమీద X మార్కు వేశాడ.

పాపం సుభద్ర!

అంతరంగం ఎదురుతిరగబోతూం డగా నొక్కిపడేశాడు. "ప్రపంచంలో అనేకమంది దురదృష్టవంతులున్నారు. వాళ్లని వుద్ధరించడం నా పని కాదు. పుణ్యంచేసి అగాధంలోపడేకంటె పాపం చేసి అందలం ఎక్కడం కావాలి. ఇది జీవితం. నేను మనిషిని. రోడ్డుమీద వడుస్తూండగా ఏదయిన ఎదురైతే తప్పించుకోవడం లేదూ.... ఇదీ అంతే."

కొట్టివేసిన పేజీలు చదవసాగాడు.

ఫిబ్రవరి 2.

ప్రొద్దుపోయి యింటికి వచ్చాను. ఏమిటో వెధవ వుద్యోగం .... రోజులు భారాబుగా వున్నాయి. ప్రొద్దుట వండిన అన్నం ఏడుస్తూ తింటూండగా తలుపు చప్పుడయింది. ఎంగిలిచేత్తోనే తీశాను. సుభద్ర. విస్మయంగా చూశాను. ఆరు నెలలనుంచి యిక్కడ వుంటున్నా ఆమెతో మాట్లాడినవి ఆరుమాటలయినా వుండవు.

"భోంచేస్తున్నారా....కానివ్వండి .... కూర్చుంటాను."

భోంచేస్తుండగా నా వెనుకగా వచ్చి "మీ బండారం బయటపడింది సాయంత్రం." అంది నవ్వుతూ.

"రోజులు బాగాలేవు కూడ.ఏంజరిగిం దాని భయపడ్డాను."

"అలాచూస్తారేం పురోహిత్‌గారూ" అంది పమిటచెంగు అడ్డం పెట్టుకుని నవ్వి.

భోజనం ముగించి లేచాను. "అదా.... చంపేశారు..."

"అజ్ఞాతంగా ఎందుకుండా లను కున్నారు?"

"ప్రచారం నా కిష్టముండదు."

తర్వాత సంభాషణ విమలవిముక్తి మీద జరిగింది. ఆ నవల సుభద్రకి బాగా

వచ్చింది కాలోలు "మీ నవలకి సాంఘిక ప్రయోజనం వుందంటారా!" అంది.

"అంతా మారిపోతారని కాదు. చదివిన వేయిమందిలో వందమందికి ఆలోచన కలిగితే, అందులో పదిమంది ప్రయత్నిస్తే ఒకర్రయినా విజయం సాధిస్తారని నా ఆశ."

నా నవలలు మరి రెండు తీసుకుని సుభద్ర వెళ్ళిపోయింది.

ఫిబ్రవరి 3.

లేచేసరికి పొద్దుపోయింది. అన్నం వండే ప్రయత్నంలో వుండగా పెరటి దారిన సుభద్ర వచ్చింది. "మీ కెందుకు అవస్థ, నేను వండిపెడతాలెండి." అంది.

"వద్దు. మీకు శ్రమ యివ్వడం బాగోదు. ఉత్తగానే మీ వదిన మండిపడతారాయె".

"పోనీ అన్నంమాత్రం వండుకోండి. మిగతావి నేను యిస్తాను."

"తప్పదా !"

నోటితో సైగచేసింది.

ఫిబ్రవరి 5.

వంటబాధ తప్పడం, సుభద్ర అమృతం రుచిచూడటం అదృష్టం. నా కోసం ఆమె వంట తొందరగా చేసుకుని యిబ్బందిపడుతూందేమో!

ఫిబ్రవరి 7.

సుభద్రని చూస్తే జాలివేస్తుంది. ఇంటెడుచాకిరీచేసిన సానుభూతికి నోచుకోలేదు. కుంచితపాదం కూడ అభ్యుదయ భావాలుగల మనిషికాదు. సుభద్రకి రేపు ఏమిటి ? కుంచితపాదం తర్వాత ఎవరు చూస్తారు ? మొన్నరాత్రి కుంచితపాదంతో విధవా వివాహంమీద చర్చించాను.

"మాది నిప్పులాంటి వంశమండోయ్! వెధవముండకి పెళ్ళేమిటి? మన శాస్త్రాలు ఒప్పుతాయా" అంటూ సంకుచితంగా వాదించాడు.

సుభద్ర కూడా చొరవగల మనిషి కాదు.

ఫిబ్రవరి 11.

తలపోటుగా వుండటంవల్ల మధ్యాన్నం వచ్చేశాను. బాధగా మంచంమీద దొర్లుతూంటే సుభద్ర వచ్చింది. "అమృతాంజనం రాస్తానాగండి," అంటూ షెల్ఫ్ లోని డబ్బాతీసి మంచంవారగా కూర్చుని రాయసాగింది. ఆ స్పర్శకే బాధ మటుమాయమైపోతోంది. పమిట చెదిరినా ఆమె చూసుకోలేదు. తెల్లటి బ్లవుజ్ ని చీల్చి చందాదాలన్న వుధృతంగా పాలిండ్లు కదులుతున్నాయి.

సుభద్ర అందం అడవికాచిన వెన్నెలేనా ?

ఫిబ్రవరి 21.

ఎవరూలేని నాకు సుభద్ర అన్నీ అనిపిస్తోంది. ఆమె సాన్నిహిత్యంలో మనసు ప్రశాంతంగా వుంటోంది.

మార్చి 2.

కాదంబరి పిల్లలని తీసుకుని పెళ్ళికి

వెళ్లింది. ఆదివారం కాబట్టి యింటిదగ్గరే వుండిపోయాను. సుభద్రతోకల్సిభోజనం చేయడం థ్రిల్లింగ్.

మధ్యాహ్నం భోజనాలయ్యాక హాల్లో కూర్చున్నాం. సన్నగా తుంపర పడుతోంది. ఆమెతో ఎన్నోచెప్పాలనివున్నా ఏంమాట్లాడలేకపోతున్నా.

ఇంతలో రషీద్ పాప వచ్చింది. బిస్కెట్లు యిచ్చింది. వాటిని తీసుకుని పాప వెళ్లిపోయింది.

"గడియారాలకి రషీద్ చెడ్డకాలం బాగుచేసి మంచికాలం యిస్తాడు కదూ!" అంది సుభద్ర.

"అది అతడి జీవనం" అన్నా.

సుభద్ర అన్నీ గమనిస్తుంది. తెలుసుకుంటుంది.

మార్చి 17,

నవల రాయడానికి తెల్లవారుఝామున లేచాను. అయిదింటిదాకా రాసి స్నానానికి లేచాను. ఇంకా ఎవరూ లేవలేదు. పెరటివైపు ప్రశాంతంగా వుంది.

బావికి దూరంగానే ఆగిపోయాను.

సుభద్ర బావిగట్టుమీద నగ్నంగా స్నానంచేస్తోంది. నీళ్లు పాలరాతిలాంటి వంటిమీద జలజల జారిపోతున్నాయి.

నాలో సంచలనం. వెనక్కి ముందుకి కదలాలనిపించలేదు. ప్రభాతకాంతుల్లో ఆమె యవ్వనం మణిదీపాల వెలుగులా వుంది.

తొలకరివానలో తడుస్తున్న వరిచేనులా వుంది.

సుభద్ర సబ్బుకోసం గోడకేసి లేచింది. నన్ను చూసింది. చీర దూరంగా దానిమ్మచెట్టుమీద వుంది. చేతులతో వక్షం కప్పుకుంది. ఆమె కళ్లల్లో కోపం, భయం, బిడియం ఏకసారి తొంగి చూశాయి. నేను లోపలికి వచ్చేశాను, ఆమె మూగవేదన విని.

మార్చి 21.

సుభద్ర మూడురోజుల నుంచి కనిపించడంలేదు. కోపం వచ్చిందేమో. కూరలు వగైరాలు దత్తుచేత పంపిస్తోంది.

మార్చి 22.

సుభద్రని కల్సుకోవాలని ప్రయత్నించాను. కుదరలేదు. తప్పించుకుని తిరుగుతోంది.

మార్చి 24

ఉదయం దత్తు కూరలు తెచ్చేసరికి మూల్గుతూ పడుకుని "వద్దు బాబూ జ్వరంగా వుంది." అన్నాను. తిరిగి తీసుకుపోయాడు. నా ఎత్తు ఫలించింది. పదకొండున్నరకి సుభద్ర పిల్లిలా నా ముంగిట నిలచింది. మూలగడం ఆపి ఆమెని మంచంమీదకి లాగి "నా మీద ఆ రోజునుంచీ కోపంగా వుందికదూ" అన్నాను.

"ఉంది. ఏంచేస్తారు ?" దూరంగా జరిగి కవ్వింపుగా అడిగింది.

"పెళ్లిచేసుకుందాం."

"మా వదిన్నడగండి."

మార్చి 25.

కాదంబరిని అడిగాను సాయంత్రం సుభద్ర గుడికి వెళ్ళినపుడు. "ఇలే విర్వాకించేస్తావు చాలుచ్చాలు" అంది విరళనగా. నాకు బాకీ వుండటంవల్ల పెద్దగా అరవలేదు. "నా పెత్తనం ఏముంది? ఆయన్ని అడగాలి" అంది దాటేస్తూ. సుభద్రని వదులుకోవడం ఆమె కిష్టం లేదు. మాత్రం చాకిరిచేసేమనిషి దూరమై పోతే ఆమె అవస్థపడాలి. సుభద్రపై అదీ ప్రేమ.

మార్చి 28.

"మా వదిన ఏమంది?" రాత్రి తలుపుతట్టి సుభద్ర ఆశగా యెంతో అడిగింది.

చెప్పాను.

"అలాగందా?" సుభద్రలో నిరాశ నిట్టూర్పులు!

"ఏదో చేద్దాంలే ...." ఓదార్పుగా అన్నాను.

ఏప్రియల్ 2.

సుభద్ర కావాలి నాకు. కాని ఎదిరించే ధైర్యం, నైపుణ్యం లేవు. ఆర్థికబాధలే అందుకు కారణం. మంచి ఉద్యోగం దొరికినా బాగుండును.

ఏప్రియల్ 20.

రాత్రి భోజనమయ్యాక పుస్తకం చదువుతూ కూర్చున్నాను. సుభద్ర వచ్చింది. కుర్చీలో నా ఎదురుగా కూర్చుని "ఏం ఆలోచించారు?" అంది

ఇబ్బందిగా చూశాను.

నా భావం గ్రహించినదానిలా, "నాకో దారి కనిపించింది" అంది.

"చెప్పు."

చెప్పడానికి సిగ్గుపడింది. ఎంతో బ్రతిమాలించుకున్నాక చెప్పింది సిగ్గుపడి.

"సెక్సు మీదకి ఎలా పోయింది దృష్టి".

చెప్పింది సుభద్ర

విన్నరాత్రి అన్న-వదినల శృంగారం ఆమె కంటపడింది. ఆమెలోని వయసు రాత్రి నిద్రపోనీయలేదు. కోరికలతో శరీరం కాలిపోయింది.

ఎంత దారుణం అది!

ఏప్రియల్ 22

సుభద్ర చెప్పిన ఆలోచన బాగుంది. పెళ్ళితర్వాత జరిగే శోభనం ముందే కానిస్తే సుభద్ర నెలతప్పక మానదు. అప్పుడు చేస్తాడు కుంచితపాదం చెల్లెలి పెళ్ళి .... సుభద్రకికూడా తెలివి వుంది. మగవాడు చిన్న విషయాల్లో ధైర్యం చూపిస్తాడు. స్త్రీ ముఖ్య విషయాల్లో తెగింపు చూపిస్తుంది.

ఏప్రియల్ 24.

మధ్యాహ్నం భోజన మయ్యాక సుభద్రని పిలిచాడు. కాదంబరి నిద్రలోకి జారుకున్నాక ఆమె వచ్చింది.

"నువ్వు చెప్పినదారే బాగుంది

సుభద్రా" అన్నా గదిలోకి వచ్చాక.

"మీ రచయితల బుర్ర అలాగుంది.

సుభద్రని కౌగిలిలో బంధించి "మరి ఈ అందాలన్నీ నేను జుర్రుకోవడం ఎప్పుడు ? ఇవాళేనా ?" మౌనంగా అడిగాను.

"అబ్బా ఆశ....వచ్చే నెల మా వదిన పుట్టింటికి వెళుతుంది పెళ్ళికి. వారం దాకా రాదు. అప్పుడు"

"ఆగవల్సిందే .... అప్పటిదాకా !" నిరుత్సాహంగా అడిగాను.

"తప్పదు"

ఏప్రియల్ 30.

సునీత షాపుకి వచ్చింది. రాత్రి వాళ్ళింటిలోనే భోజనం.

మే 1.

ఉద్యోగం పోయింది. ఎలాగ బ్రతకడం ? ఈ పరిస్థితిలో సుభద్రని అన్యాయం చెయ్యనా ?

మే 2.

పాడ్కులో సునీత కనిపించింది. రోజులు గడవడానికి ఆమెతో అబద్ధం చెప్పాను. సునీత తమయింటిలో వుండమంది. ఈలోగా ఆమెని ఆకర్షిస్తే బ్రతుకుభయం తప్పుతుంది.

భరద్వాజ డైరీ మూసివేశాడు.

"ఏంచేస్తున్నారు కవిగారు ?" సునీత లోపలికి వచ్చింది.

ప్రతీ శుక్రవారం సాయంత్రం సునీత విధిగా దేవాలయానికి వెళ్ళి కుంకుమపూజ చేయిస్తుంది. ఆరోజు పూజయ్యాక ప్రసాదం తింటూ మంటపంలో కూర్చుంది ఆలయం చుట్టూ ప్రదక్షిణాలు చేస్తున్న సుభద్ర కనిపించింది. పిలచింది. రేపు ప్రధానం జరుగుతుంది. అదిచెప్పాలి సుభద్రకి. సుభద్ర దర్శన మయ్యాక వచ్చింది.

"ఇంకా నీకీ పూజ లెందుకే? ఏ దేముడూ నీ మొరవినడు. నీ కన్నీళ్లు తుడవడు!" అందిబాధగా సుభద్ర దౌర్భాగ్యానికి వగస్తూ.

"తుడిచే రోజూ వచ్చింది."

వాళ్ళమధ్య తమతమ సమస్యలతో కలుసుకోలేదు. ఆ విషయాలు ఒకరికొకరు తెలియచేసుకోవాలి.

"పప్పుఅన్నం పెట్టేస్తున్నావా!" ఆసక్తిగా సునీత ముందుకు వంగింది

భరద్వాజ పరిచయం, పెళ్ళికి తమ పథకం చెప్పింది సుభద్ర.

సునీతముఖం నల్లబడిపోయింది జేగంటధ్వనిలా మెదడు ఖంగ్‌మంటోంది. భరద్వాజ తనని మోసంచేస్తున్నాడా? సుభద్రతో ఈ నిర్ణయానికి వచ్చి తనతో పెళ్ళికి ఎలా సిద్ధమయ్యాడు? ఇంత దారుణమా?

"నీతో ఎప్పటినుంచో చెబుదామనుకుంటున్నాను సునీతా! మనం కల్పుకోవడం కుదరడంలేదు. భరద్వాజ కాగితం పులికాదు. నాకోసం ఆయన తన జీవితాన్నే త్యాగంచేస్తున్నారు." సుభద్ర

పొగిడింది.

సునీత సంఘర్షణలో తేలిపోతుంది.

"ఏమిటే.... ఏం మాట్లాడవ్ .... నీ కేమని పిస్తోంది!" సుభద్ర తట్టింది.

"నువ్వెంత వెర్రికుంకవే సుభద్రా. నువ్వు కడుపు తెచ్చుకున్నాక కళ్యాణం జరుగుతుందా? భరద్వాజకి ఆ మోజు వుంటుందా? కుక్కలు చింపిన విస్తరవుతుంది నీజీవితం. సానుభూతి చూపేవారు కూడ వుండరు."

భరద్వాజ అలాంటి మనిషికాదు. నాకు నమ్మకం వుంది."

"అతడి గురించి నీకేం తెల్సునని నమ్మకం పెంచుకున్నావే? నీది అమాయకత్వమనాలో? అతిసాహస మనాలా."

సుభద్రకి ఆమె అలా ఎందుకు మాట్లాడుకోందో అర్ధంకాలేదు. తనని మెచ్చుకుని ప్రోత్సాహిస్తుందనుకుంది.

సునీత వానిటీబ్యాగ్‌లో నుంచి కవరు తీసి, నిన్న తను భరద్వాజ, తీయించుకున్న ఫొటోయిచ్చింది. సుభద్రకి కళ్ళు తిరిగాయి. నువ్వు..భర...."అంటే .." అంది అయోమయంగా.

"ఈ ప్రబుద్ధుడు మా యింట్లోనే వుంటున్నాడు. నాకు మొగుడు కాబోతున్నాడు ...." జరిగింది వివరించింది సునీత.

"భరద్వాజ కూడా మేడిపండే।" సుభద్ర విషాదంగా గొణుక్కుంది.

"నాతో చెప్పావు కనుక సరిపోయింది.



లేకపోతే ఆ యిడియట్ యిద్దర్నీ నాశనం చేసివుండేవాడు. సుభద్రా! వెర్రిపద్ధతులు మానేసి మీ అన్నయ్య ఎలాగూ అక్షింతలు వెయ్యడు కనుక, ఎవర్నయినా తీసుకుని లేచిపో; అదృష్టం బాగుంటే సుఖపడతావు, ఇక్కడ నిత్యం ఏడ్చేకంటే అదేనయం...." సునీత ఆవేశంగా అంది.

సుభద్ర లేచింది. సునీత కారుదగ్గరకి వచ్చి "ఎక్కు, అంది". "వద్దు నడిచి పోతాలే...." భారంగా అంది ముందుకు నడుస్తూ.

ఆమె గాయపడివుందని సునీత బల వంతం చేయలేదు. కాస్సేపు ఒంటరిగా వుంటే ఏదోలా సమాధానపడగలుగు తుంది.

సునీత కారు ఎక్కాగానే సుభద్ర డోరుదగ్గరకొచ్చి, "భరద్వాజా, నువ్వు సుఖపడాలని మనసారా కోరుకుంటున్నాను సునీతా! మా బతుకుల్లో ఎలాగు వుండదు తొలిపొద్దు .... నువ్వయినా బాగుంటే చాలు. అది నాకు జరిగిన శుభమని పొంగి పోతాను,"అనేసి విసురుగా ప్రక్కసందు లోకి నడిచింది.

"పిచ్చిమొద్దు".

సుభద్ర వడిగా యింటికి వచ్చింది. కాదంబరి పిల్లల్ని తీసుకుని సినిమాకి వెళ్లింది. సుభద్ర యింటిపని ముగించు కుని వరండాలో నించుంది.

రషీద్ పాప తప్పటగులువేస్తు వచ్చింది. సుభద్ర బిస్కట్లు యిచ్చింది. రషీద్ పాపని తీసుకుపోడానికి వచ్చాడు.

"ఎవరిచ్చారమ్మా బిస్కట్లు?" రషీద్ ఎత్తుకునివెళుతూ అడిగాడు పాపని

"అ....మ్మ"

"తప్పమ్మా....అమ్మగారనాలి."

సుభద్ర మనస్సు చురుగ్గా పనిచేసింది.

## 5

గుడివించి యింటికి వెళ్లాక భరద్వాజని తీసుకుని బజారుకి పోయి పెళ్ళిచీరలు, నగలు కొనాలని మొదట అనుకుంది. తిరుగు ప్రయాణంలో అది కాన్సిల్ చేసు కుంది. తనని భరద్వాజ వంచించాడని కంటె, సుభద్రకి అన్యాయం చెయ్య బోయాడని ఆమె మనసు వ్యాకులపడు తోంది. ఆమె ఎన్నాళ్లగానో నిరీక్షించిన అవకాశం తనవల్ల చేజారిపోతుంది.

పార్కులో చాలసేపు ఒంటరిగా కూర్చుని ప్రొద్దుపోయాక యింటికి వెళ్లింది. పాలుమాత్రం త్రాగి గడియ వేసుకుని పడుకుంది. పదకొండు గంట అకి భరద్వాజ ఎంతగానో తలుపుతట్టినా తీయలేదు.

నిద్ర రావడంలేదు. తను, భరద్వాజ, సుభద్ర. ఈ త్రిభుజంమీద ఎన్నో ఆలోచనలు! ఎన్నెన్నో పద్ధతులు! ఎంతో ఆవేశం.


ఏం చెయ్యాలో రాత్రే తయారైంది.

ఉదయం మామూలుగానే లేచింది. తండ్రిగదిలోకి వెళ్లింది. ఉదయం ప్రధానం జరిగిపోయాక మధ్యాన్నం పల్లవరావు ఢిల్లీ ప్రయాణం. బట్టలు సర్దుకుంటున్నాడు.

"నేనూ వస్తాను నాన్నగారూ ఢిల్లీ."

అంది నెమ్మదిగా.

"అతడూ వస్తున్నాడా? హనీమూన్‌కి ఢిల్లీ బాగోదమ్మా. స్టేట్స్‌కి పోదురు



గాని".

పెళ్ళి నిరాకరించే కారణాలన్నీ చెప్పింది.

"ఆల్ రైట్ ... ఫాలో మీ .... భరద్వాజకి చెప్పావా?" ఆయన కూతుర్ని దాటి ఏమీ చెయ్యలేడు. కూతురికి నచ్చాకనే పెళ్ళి!

"ఉత్తరం రాశాను...." అంది గది దాటిపోతూ.

భరద్వాజ గదిలో ఉత్తరం చదువుకుంటున్నాడు "నిన్ను చూడాలనిపించక ఉత్తరం రాస్తున్నాను. సుభద్ర అందమూ కావాలి, నా డబ్బూ కావాలి. రచయితవి గనుక అందంగా మాటలు చెప్పావ్! ద్విపాత్రాభినయం వల్ల నీకు నష్టం లేకపోవచ్చు మా జీవితాలు ఖరాబవుతాయి. సుభద్ర పరిధి చాల స్వల్పమైనది. ఆమె అనుకున్నదల్లా చేయడానికి ఆమె జీవిత విధానం ఒప్పుకోదు. చేసిన సాహసం విఫలమైతే ఆత్మహత్యకి ఎన్ని దారులున్నాయని ఆమె వెతుక్కోవాలి. నేను ఓడిపోయినా ఫర్వాలేదు. నా చుట్టూ డబ్బుంది. నీ లాంటి మొగుడిని నేను కొనుక్కోగలను సుభద్ర కది అసాధ్యం. నువ్వు దాన్ని పెళ్ళిచేసుకో. దాని బ్రతుకులో దీపం వెలిగించు. అది నిన్ను నమ్ముకునివుంది. మీ పెళ్ళికాగానే లక్షరూపాయల చెక్కు నా పెళ్ళికానుకగా అందుతుంది. సుభద్ర జీవితం చిగురించాలి. వసంతాలు ఆమె ముంగిట నిలవాలి. మీకు ఏ సాయం చెయ్యడానికైనా నేనున్నాను. మనిషిగా ఆలోచించు. మానవత్వం రుజువుచేసుకో. నువ్వు మేధావివి కనుక తిరిగి తప్పు చేయవు. బెస్ట్ ఆఫ్ లక్... ....

సునీత."

భరద్వాజ నిషా అంతా దిగిపోయింది. రసంలేని చెఱకుపిప్పిలావుంది అతడి ముఖం. మండుటెండలో నిప్పులు తొక్కినట్లుంది. కల చెదరిపోయింది.

తొందరగా తన సామాను సూటు కేసులో సర్దివేశాడు. సునీతని కలవడానికి అభిమానంగా వుంది. పౌరుషంగా వుంది, అవమానంగా వుంది. సుభద్ర గొడవ ముందరగా చెప్పినా బాగుండుననిపించింది. లేక సుభద్రతోనే నన్ను 'మరచిపో' అని వుండాల్సింది. ఏదీ చెయ్యలేదు. అందుకే మొత్తానికి ఫెయిలయింది. ఇప్పుడెంత విచారించినా లాభంలేదు. రైలువెళ్ళిపోయింది.

భరద్వాజ పడింటికి చాటుగా సూట్ కేసుతో రోడ్డుమీదకి వచ్చి రిక్షా ఎక్కాడు! అకస్మాత్తుగా అతడికి ధైర్యం వచ్చింది. సుభద్ర .... తను చెరిపేసుకున్న చిత్రం.... పారేసుకున్న బొమ్మ. తిరిగి దొరుకుతోంది. ఇద్దరం బొమ్మరిల్లు నిర్మించుకుంటాం. సునీత కురూపితనం జీవితాంతం భరించడం మాటలా ?

భరద్వాజ తిరిగి పాతయింటికి వచ్చి తాళంతీసి సూట్ కేస్ లోపల పడేశాడు. "సుభద్రా" అంటూ యింట్లోకి వెళ్ళాడు.

గాలికి డోర్ కర్టెన్లు ఎగురుతున్నాయి. ఇల్లు నిశ్శబ్దంగా వుంది. భరద్వాజ అన్నిగదులు చూసి వంటింటిలోకి వచ్చాడు. కాదంబరి రుబ్బురోలుదగ్గర పచ్చడి చేసుకుంటోంది.

భరద్వాజని చూసి అవాక్కయిపోయింది. ఛీత్కారంగా చూసి తల తిప్పేసుకుంది. భరద్వాజ పలకరించలేక రోడ్డుమీదకి వచ్చాడు.

వాచీ చూశాడు. ఆగిపోయివుంది. అతడి దృష్టి ఎరిదుంటిమీద పడింది. అక్కడ కొత్తగా ఓ దర్జీ బట్టలు కుట్టుకుంటున్నాడు. రషీద్ దుకాణం లేదు.

'......... రషీద్ చెడ్డకాలం బాగుచేసి మంచికాలం యిస్తాడు కదూ !' అన్న సుభద్ర మాటలు గుర్తుకువచ్చాయి.

అంటే... ....? అంటే.........?

